# అక్రమాల నిగ్గు తేల్చండి




-ప్రజా ధనాన్ని కొల్లగొడితే ఉపేక్షించం
-సిపిఐ నేత, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని


ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 23 | జూన్ | 2024
పేజీలు 7


# సారూ.. ఇదేం తీరు

-అనైతిక చర్యలతో వృత్తికే కలంకం తెస్తున్న కొందరు ఉపాధ్యాయులు
-మద్యం మత్తులో పాఠశాలకు ఉపాధ్యాయుడు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రోజు రోజుకు స్థాయి దిగజారి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే కలంకం తేస్తున్నారు కొందరు ఉపాధ్యాయులు. వృత్తిపట్ల బాధ్యతగా లేకపోవడం సరైన పర్యవేక్షణ కొరవడడం అనైతిక చర్యలకు తావిస్తుంది. అతి కొద్ది మంది వ్యవహారం మొత్తం విద్యా వ్యవస్థకు చెడ్డపేరు తెస్తుంది. భద్రాద్రి కొత్తగూడెంజిల్లా ముల్కలపల్లి మండలం రాజీవ్ నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వీరయ్య మద్యం సేవించి విధులకు హాజరయ్యాడు. మత్తులో నడవలేక పాఠశాల బయటే రోడ్డుపై పడిపోవడంతో గ్రామస్తులు అతన్ని రోడ్డు పై నుంచి ఓ చావిడిలోకి తీసుకెళ్లి పడుకోబెట్టారు. ఈ ఉపాధ్యాయుడు రోజు ఇదే రీతిలో వ్యవహరిస్తున్నాడని తల్లిదండ్రులు, విద్యార్థులు వాపోతున్నారు. ఇది ఒక వీరయ్యకే పరిమితం కాలేదు. గత కొంత కాలం నుంచి పరిశీలిస్తే విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మద్యం మత్తులో విద్యార్థులను చితకబాదడం, వివాహేతర సంబంధాలు పాఠశాలల్లోనే ఉండి బోధనకు తిలోదకాలు ఇచ్చి సెల్‌ఫోన్లలో రియల్

మిగతా 2లో..

## 28 నుంచి ఖమ్మంలో సిపిఐ రాష్ట్రస్థాయి సమావేశాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశాలు ఈనెల 28 నుంచి 30 వరకు ఖమ్మంలో జరగనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని 29, 30 తేదీలలో కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశాలకు సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, చాడా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు హాజరవుతారని ప్రసాద్ తెలిపారు. గత కార్యక్రమాలను సమీక్షించుకుని ఈ సమావేశాల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోనున్నట్లు ఆయన తెలిపారు.

## రూ.31 కోట్లతో
# రైతు రుణమాఫీ అమలు




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వచ్చే నెల లో రూ.31 వేల కోట్లతో రైతులకు రుణమాఫీ అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలం లోని మోటాపురం, శంకరగిరితండా, రాజేశ్వరపురం, అమ్మగూడెం, కోరట్లగూడెం, కోనాయిగూడెం, ఆరెగూడెం, ఆచార్లగూడెం, బోదులబండ, మంద్రాజుపల్లి గ్రామాలలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...కాంగ్రెస్ ఎన్నికల

మిగతా 2లో..

-అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## ఖమ్మం మార్కెట్
# విస్తరణకు ప్రతిపాదనలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం మార్కెట్ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఖమ్మం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ 15 ఎకరాలలో నిర్మించబడింది. తొలి నాళ్లలో మార్కెట్‌కు వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు

-రూ. 148.5 కోట్ల అంచనా
-విస్తరణకు మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ

అంతగా లేకపోవడంతో మార్కెట్ లో ఇబ్బందులు తలెత్తలేదు. కాలక్రమేణ పత్తి, మిర్చి ఇతర వాణిజ్య పంటల సాగు

మిగతా 2లో..

# సారూ.. ఇదేం తీరు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్టేట్ వ్యాపారాలు చేయడం, చిట్టిలు రకరకాల ఆర్థిక పరమైన వ్యవహారాలను నిర్వహిస్తూ ఐపిలు పెట్టడం ద్వారా ఉపాధ్యాయ వృత్తి గౌరవం మసకబారుతుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సరిగ్గా లేక రోజు రోజుకు ప్రభుత్వ విద్య కుచించుకుపోతుంది. ఒక మండలం మొత్తంలో  ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కంటే ఒక మామూలు ప్రైవేటు విద్యా సంస్థలో ఉండే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుందంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఇదే ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తే భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా వ్యవస్థే కనుమరుగవుతుంది. ప్రభుత్వం విద్యా వ్యవస్థ పట్ల ప్రదర్శిస్తున్న వైఖరి ఈ తీరుకు కారణమవుతుంది. మండల విద్యాశాఖాధికారుల నియమాకాలు లేకపోవడం జిల్లా విద్యా శాఖాధికారులు కనీస పర్యవేక్షణ లేకుండా కార్యాలయాలకే పరిమితం కావడం ఉపాధ్యాయులతో ఉన్న ఆర్థిక సంబంధాలు చర్యలు తీసుకోవడానికి అడ్డుగా మారడం విద్యా వ్యవస్థ దిగజారడానికి కారణమవుతుంది. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులే మండల విద్యా శాఖాధికారులుగా కొనసాగుతున్నారు. వారు పాఠశాలలకే పరిమితం కావడంతో సమయ పాలన , బోధన పద్దతులు, ఉపాధ్యాయుల వ్యవహార శైలిని పరిశీలించే అవకాశం ఉండడం లేదు. దీనితో కొందరు ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రిజిస్టర్‌లో సంతకాలు చేసి పాఠశాల వదిలి రిజిస్టర్ కార్యాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేసే ఉపాధ్యాయులు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు. పాఠశాలలో ఉన్న నిరంతరం ఫోన్లలో మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. మరికొందరు ఉపాధ్యాయులు పంచాయితీలు నిర్వహిస్తూ పాఠశాలకు ఎగనామం పెడుతున్నారు. ఓ ఉపాధ్యాయుడు పాఠశాలకు సెలవు పెట్టి విదేశాలకు వెళ్లినా మీడియాలో వార్త వచ్చేంత వరకు విద్యాశాఖ గమనించ లేదంటే ఎంత నిద్రావస్థలో ఉందో అవగతమవుతుంది. ఏమి చేసినా మీరు మీడియాలో రాకుండా చూసుకోండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. విద్యా వైద్యానికే తమ తొలి ప్రాధాన్యత అని చెబుతున్న పాలకులు విద్యా వ్యవస్థ దిగజారుడుతనాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవడంలో మాత్రం వైఫల్యం చెందుతున్నారు. అధికారులు లేకుండా వ్యవస్థ సరిగ్గా పనిచేయదన్న సూత్రాన్ని తెలుసుకుని విద్యాశాఖలో పూర్తి స్థాయిలో నియమాకాలు చెపట్టాల్సిన అవసరం ఉన్నది. చర్యలు తీసుకోకుండా ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో  ప్రభుత్వ విద్య కనుమరుగు కాక తప్పదు.

## ఖమ్మం మార్కెట్ విస్తరణకు ప్రతిపాదనలు




(మొదటిపేజీ తరువాయి)

పెరగడం ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణలోని వరంగల్, నల్గొండ జిల్లాల రైతులు, ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి కృష్ణా, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తమ తమ ఉత్పత్తులను తీసుకు వచ్చి విక్రయిస్తుండడంతో సరైన వసతులు లేక వ్యాపారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో రోజు లక్ష బస్తాలకు మించి మార్కెట్‌కు వస్తుండడంతో మార్కెట్ ప్రాంతమంతా బస్తాలతో నిండిపోయి చుట్టూ ఉన్న రోడ్లు కూడా ఆక్రమించి రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల సౌకర్యార్థం ఖమ్మం మార్కెట్‌ను పునర్మించడానికి ప్రతిపాదనలు సిద్దం చేయాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు మార్కెట్ యార్డు అధికారులు రూ.148.5 కోట్ల అంచనాతో నివేదికను రూపొందించారు. తుమ్మల ఆ ప్రతిపాదనలకు కొన్ని సవరణలు చేసి ప్రభుత్వానికి పంపించారు.

# అక్రమాల నిగ్గు తేల్చండి





**ప్రజాపక్షం/ లక్ష్మి దేవిపల్లి :** కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రంలో స్క్రాప్ టెండర్ల అవినీతిని నిగ్గు తేల్చాలని ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కెటిపిఎస్‌ను సందర్శించిన ఆయన ఓఅండ్ ఎం డిడి ప్రాంతాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం సిఈ ఛాంబర్‌లో అధికారులతో భేటీ అయ్యారు. స్క్రాప్ టెండర్ ప్రక్రియ విచారణ కమిటీకి అందించిన నివేదికలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోట్ల రూపాయల విలువల గల ప్రజా ధనం దుర్వినియోగం అయ్యాయన్న సమచారం నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో జరిగిన టెండర్ ప్రక్రియ పై విచారణ చేపట్టి బాధ్యలను కఠినంగా శిక్షించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. తెలంగాణకు తల మానికంగా ఉన్న కేటిపిఎస్‌లో అవినీతిని సహించేది లేదని అక్రమాలకు పాల్పడాలని చూస్తే తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సాంబశివరావు వెంట ఓఅండ్ ఎం సిఈ, ఎస్ఈలు, ఇతర కెటిపిఎస్ అధికారులతో పాటు తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ స్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, నాయకులు ముత్యాలవిశ్వనాథం, సాయిబాబా, పూర్ణచందర్‌రావు ఉన్నారు.

## రూ.31 కోట్లతో రైతు రుణమాఫీ అమలు

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ఇచ్చిన హమీలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులకు రూ.31 కోట్లతో రుణమాఫీ అమలు చేసి తీరుతామని అన్నారు. రుణమాఫీ ని తట్టుకోలేక ప్రతిపక్షాలు నోరుజారుతున్నారని అన్నారు. పేదలకు ఇచ్చిన హమీలను అమలు చేయటంలో వెనక్కి తగ్గేది లేదని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీలను దశల వారీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి తో ఉన్నామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదవాళ్లలో అతి పెదవాళ్ల కు ముందు మంజూరు చేస్తామని అన్నారు. లిఫ్టులు రిపేరు చేయించి రైతులకు సాగు నీటిని ఇబ్బందులు లేకుండా చేస్తామని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇండ్లు, రేషన్‌కార్డు, సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. వివిధ గ్రామాలలో వినతి పత్రాలను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.  మోటాపురంలో సొసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు గజమాలతో ఘనంగా సన్మానించారు. మండలం లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, ఎంపీపీ రమ్య, కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్, జెర్రిపోతుల అంజిని, రావెళ్ల కృష్ణారావు, గుడిమళ్ల మధు, పెంటమళ్ల పుల్లమ్మ, పి.మాధవి,  పాకనాటి కన్నారెడ్డి, కొచ్చేర్ల శ్రీనివాసరావు,  మేకల వెంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్, మారుతి కోటి తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి కొడుకులపై గొడ్డలితో దాడి

- ఒకరి పరిస్థితి విషమం
- ఆసుపత్రికి తరలింపు



**ప్రజాపక్షం/కొణిజర్ల:** తండ్రి కొడుకులపై మరో ఇద్దరు తండ్రి కొడుకులు గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో తండ్రి తీవ్ర గాయాలయ్యా యి. ఈ సంఘటన మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు కథనం ప్రకారం గ్రామానికి చెందిన బొల్లెపోగు వెంకటి తన పొలానికి కంకణాల చిన్న శ్రీను పొలంలో నుంచి వెళుతున్న క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం ఇరువురు ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మేడి కొండలు ఇంటి దగ్గర దారి విషయాన్ని కంకణాల చిన్న శ్రీను కొడుకు అవినాష్‌తో కలిసి చర్చిస్తుండగా బొల్లెపోగు వెంకటి తన కుమారుడు వంశీతో కలిసి కొండలు ఇంటికి వచ్చి కంకణాల చిన్న శ్రీను కొడుకు అవినాష్‌ల తలపై గొడ్డలి ఇనుప రాడ్లతో తలపై బలంగా కొట్టారు. దాడి జరిగిన విషయం తెలుసుకున్న గ్రామస్థులు, బంధువులు అక్కడికి రావడంతో అక్కడ నుంచి దాడి చేసిన వెంకటి, వంశీలు పారిపోయి ఇంట్లో తలుపులు వేసుకున్నారు. రక్తం చూసి కోపోద్రిక్తులైన స్థానికులు స్థానికులు, మహిళలు, బందశులు వెంకటి ఇంటిపైకి వెళ్లారు. దీంతో వెంకటి కొడుకు, వంశీలు  కలిసి ఇంట్లో ఉన్న కారం చల్లుతూ ఇనుప రాడ్లతో స్థానికులపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న కంకణాల చిన్న శ్రీను కొడుకు, అవినాష్‌లను స్థానికులు చికిత్స కోసం ప్రైవేటు అంబులెన్స్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి జరిగిన విషయం తెలుసుకున్న సిఐ సాగర్ కొణిజర్ల ఎస్సై శంకర్‌రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులతో చర్చించారు. నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులను సరి చేయండి

### అర్హులైన వారికి పథకాలు ఇవ్వండి : సిపిఐ



**ప్రజాపక్షం/వైరా:** ప్రభుత్వ ప్రజాపాలన దరఖాస్తు ద్వారా నమోదులో దొరికిన తప్పులు సరిచేసి అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి సభ్యులు దొండపాటి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎండి వోలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా దరఖాస్తుల్లో పేర్లు నమోదు చేయడంలో దొర్ల తప్పులు కరెంటు గ్యాస్ పక్కా ఇళ్ళు ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారని వారు తెలిపారు. పంట సాగులో ఉన్న రైతులందరికి రూ.2లక్షలు రుణమాఫి, రైతు భరోసా ఇవ్వాలని, పంటల భీమా పథకం ఏర్పాటు చేసి అమలు చేయాలని పంట పొలాలకు వెళ్లిన రైతులకు విషపురుగులు సోకిన వెంటనే వైద్యం చేయడానికి ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.  ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి స్వర్ణ రమేష్, సహాయ కార్యదర్శి తోటపల్లి సీతారాములు, రైతు సంఘం మండల కార్యదర్శి తండు సోమయ్య, జిల్లా రైతు సంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, అడపా వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, శంకర్‌రావు, సురేష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## పల్లపు ఆంజనేయులు, నర్సమ్మ దంపతులకు నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో 2వ వార్డులో కరెంటు షాక్‌తో పల్లపు ఆంజనేయులు, నర్సమ్మ దంపతులు మరణించారు. విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్ వారి నివాసానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆంజనేయులు నర్సమ్మ భౌతికఖాయాల వద్ద పూలమాల వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో బొర్రా రాజశేఖర్, మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, కౌన్సిలర్ బత్తుల గీతా శ్రీనివాస్‌రావు, పొదిలి హరినాథ్, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పమ్మి అశోక్, బోళ్ళ గంగారావు, పల్లపు కొండలు, బండారు తిరపతిరావు, బండారు నాగరాజు, దరావత్ శంకర్‌నాయక్, గుండ్రాతిమడుగు మాజీ సర్పంచ్ అప్పం సురేష్ తదితరులు ఉన్నారు.

# బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి

**-నీట్ నెట్.. ప్రశ్నాపత్రాల లీకేజీకి బిజెపిదే బాధ్యత**
**-మీడియా సమావేశంలో పోటు రంగారావు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** బొగ్గు బ్లాకులను వేలం పాట వేయకుండా సింగరేణికి ఉచితంగా కేటాయించాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. స్వదేశీ మోడీ గ్యారెంటీ నినాదంతో అధికారంలోకి వచ్చిన బిజెపి వనరులను, ఖనిజాలను, జాతి సంపదను నిలువునా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందని ఆయన ఆరోపించారు. శనివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల కొమ్ముకాస్తున్న బిజెపి ఇప్పటికే 300 బొగ్గు బ్లాకులను ప్రైవేటు కంపెనీలకు దరాదత్తం చేసిందని ఇప్పుడు మరో 60 బొగ్గు బ్లాకులను అమ్మడానికి వేలం నిర్వహిస్తుందని రంగారావు ఆరోపించారు. కోల్ ఇండియా సింగరేణి లాంటి ప్రభుత్వ సంస్థలకు అప్పగించి సంస్థలను బలోపేతం చేయకుండా ప్రైవేటు వర్గాలకు విక్రయించి వారి వద్ద నుంచి అధిక ధరలకు బొగ్గును కొనుగోలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు. సింగరేణి ఇతర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ. 3,500 నుంచి రూ. 4వేల వరకు టన్ను బొగ్గును కొనుగోలు చేస్తున్న కేంద్రం ప్రైవేటు సంస్థల నుంచి టన్నుకు రూ. 18వేల చొప్పున 18 లక్షల టన్నుల బొగ్గును కొనుగోలు చేస్తుందని ఆయన ఆరోపించారు. సింగరేణి ఆధీనంలో ఉన్న కొన్నిగనులు ఇప్పటికే మూతపడ్డాయని మరి కొన్నేళ్లలో మిగిలినవి మూతపడే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో సింగరేణిని కాపాడడానికి వేలం పాటను నిలిపివేయాలన్నారు. సింగరేణికి ఉచితంగా బొగ్గు గనులను కేటాయించాలని బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రైవేటీకరణ వైఖరి మారాలని రంగారావు కోరారు. రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు సింగరేణి పరిరక్షణ కోసం ఉద్యమించాలని విజ్ఞప్తిచేశారు. బిజెపి హయాంలో ఇప్పటికే 70కు పైగా పేపర్లు లీకై యువత భవితవ్యాన్ని దెబ్బతీశాయని తాజాగా నీట్ నెట్ పరీక్షలు లీక్ కావడంతో కోట్లాది మంది నిరుద్యోగులు నష్టపోయారన్నారు. బిజెపి వైఖరి అక్రమార్కులకు అండగా నిలుస్తుందన్నారు. ప్రదీప్ కుమార్ జోషి ఈ లీకులకు బాధ్యుడని కాని అతనినే విచారణ అధికారిగా నియమించడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో వ్యాపం కుంభకోణానికి బాధ్యుడైన ప్రదీప్‌కుమార్ జోషి పై విచారణ జరిపించాలని నీట్ నెట్ లీకులపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీని అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, రైతు భరోసాను వీలైనంత త్వరగా విడుదల చేయాలని కోరారు. మీడియా సమావేశంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు గుర్రం అచ్చయ్య, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు, పార్టీ నాయకులు ఆవుల అశోక్, ఆవుల వెంకటేశ్వర్లు, కె. రామయ్య, కమ్మకోమటి నాగేశ్వర రావు, సివై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా త్రివేణి ఆవిర్భావ దినోత్సవం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** త్రివేణి విద్యా సంస్థల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో త్రివేణి విద్యా సంస్థల ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. 31 ఏళ్ల విద్యా ప్రస్థానంలో ఎన్నో విజయాలు త్రివేణి సొంతం చేసుకుందన్నారు. బోధనాభ్యాసన కార్యక్రమంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైందన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయుల అవసరాన్ని గుర్తించి త్రివేణి యాజమాన్యం అటువంటి ఉపాధ్యాయుల చేత విద్యా బోధనను అందిస్తూ ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని త్రివేణి పాఠశాల ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుందని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డిజిటల్ క్లాస్ రూమ్స్, యాక్టివిటీ బేస్డ్ ఎడ్యుకేషన్, ఐఐటి ఫౌండేషన్, ఐఐటి ఇంపాక్ట్, ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ సిస్టం మొదలైన కార్యక్రమాలతో విద్యా రంగంలో ఎప్పటికప్పుడు నూతనంగా వస్తున్న విధానాలను అందిపుచ్చుకుంటూ విద్యార్థులకు ఉత్తమ శిక్షణను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గణితం సులభంగా నేర్చుకోవడం కోసం అబాకస్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఎంతో మంది త్రివేణి విద్యార్థులు పలు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌వో కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, శ్రీదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యదర్శుల బదిలీలు నియోజకవర్గ పరిధిలో జరగాలి



**ప్రజాపక్షం/కల్లూరుః** గ్రామపంచాయతీల కార్యదర్శుల బదిలీలు నియోజకవర్గ పరిధిలోని మండలాలలో మాత్రమే జరగాలని నియోజక వర్గ పరిధిలోని మండలాలకు చెందిన కార్యదర్శులు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఇదే మండలంలో ఇదే నియోజకవర్గంలో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండి పలు రకాలైన సేవలు అందిస్తూ ఉన్నామని, గత ఐదు నెలలుగా ప్రత్యేక పాలనలో అనేక పాట్లు పడుతూ పాలనకు సహకరిస్తున్నామని వారు ఎమ్మెల్యేకు తెలియపరిచారు. ప్రస్తుతం చేస్తున్న మండలం కాకుండా ప్రక్కనే ఉన్న మండలంకు బదిలీకి అవకాశం కల్పించాలని, సొంత నియోజక వర్గ కాకుండా వేరే నియోజకవర్గానికి బదిలీ చేయవద్దని వారు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై కలెక్టరు, డిపిఓ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కార్యదర్శులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మండలాలకు చెందిన కార్యదర్శులు పాల్గొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

# బోడేపూడి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో బోడేపూడి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వర రావు ముఖ్యఅతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు చెరువుపల్లి ప్రసాద్, ఖమ్మం శరత్ మాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి వైద్యులు షరీఫ్ రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శీలం నర్సింహారావు, మండవ ఫణీంద్రకుమారి, మందా సైదులు, రామనర్సయ్య, రాధాకృష్ణ, పడకంటి మురళీ, మద్దాల ప్రభాకర్, మధు, శేషగిరిరావు, విల్సన్, రామ్, కిషోర్ పాల్గొన్నారు.

# పాఠశాలకు డైరీలు వితరణ



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌గా పని చేస్తున్న గంతోటి సునీత వెంకటేశ్వర్లు దంపతులు 160 మంది విద్యార్థులకు రోజువారి డైరీలు నిర్వహణకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థులు ఆదర్శంగా ఉండేందుకు ప్రభుత్వ పాఠశాల ఒక ఆదర్శంగా ఉండాలనే ఆలోచనతో ఈ డైరీలు పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోట్రు మధు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, గాంధీ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం సూచిక బోర్డు సవరణ




**ప్రజాపక్షం/కల్లూరుః** ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన సమాచార హక్కు చట్టంకు తూట్లు అనే వార్తకు చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది స్పందించి సూచిక బోర్డును సవరించారు. సవరించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

# అంగన్‌వాడీలకు ఏకరూప దుస్తులు మంజూరు



**ప్రజాపక్షం/కల్లూరుః** అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యను అభ్యసిస్తున్న మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఏకరూప దుస్తులు అందిస్తున్నట్లు సిడిపిఓ మెహరున్నిసాబేగం తెలిపారు. కల్లూరు ప్రాజెక్టు పరిధిలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాలలో అంగన్‌వాడీ కేంద్రాలలో 3 6 లోపు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల పరిధిలో నడుస్తున్న 112 అంగన్‌వాడీ కేంద్రాలలో ఏకరూప దుస్తులు మంజూరైనట్లు సిడిపిఓ తెలిపారు. ఇవి త్వరలో అంగన్‌వాడీ కేంద్రాలకు అందుతాయని వివరించారు.

# హైద్రాబాద్ సర్కిల్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా షేక్.ఇబ్రహీం



**ప్రజాపక్షం/ తల్లాడ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ హైద్రాబాద్ సర్కిల్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా షేక్. ఇబ్రహీం ఎన్నికయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ హైద్రాబాద్ సర్కిల్ ఎన్నికల్లో షేక్ ఇబ్రహీం ఉమ్మడి ఖమ్మం నల్గొండ మహబూబ్‌నగర్ జిల్లాలకు అసిస్టెంట్ జనరల్ సెక్రటీగా అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. షేక్ ఇబ్రహీం గతంలో చర్చిరోడ్డులోని ఎస్‌బిఐ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా, నెల్లికుదురు మేనేజర్‌గా, తల్లాడ ఎస్‌బిఐ మేనేజర్‌గా ప్రజలకు సేవలందించి ప్రస్తుతం ఎస్‌బిఐ ఖమ్మం మెయిన్ బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫీసర్స్, ప్రభుత్వ ఉద్యోగులు, స్నేహితులు, ప్రజలు, బంధువులు తదితరులు షేక్.ఇబ్రహీంకు అభినందనలు తెలిపారు.

# గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా

**-ఎస్సీ కమ్యూనిటీ హాలుకు రూ.50 వేలు ఆర్థికసాయం**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామాభివృద్ధి కి శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు రాజేశ్వరపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు దండా ప్రవీణ్ అన్నారు. మండలం లోని రాజేశ్వరపురం లో నూతనంగా నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాలు కు రూ.50 వేల ను శనివారం అందించారు. అదే విధంగా గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆటో డ్రైవర్ ఆశోక్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గ్రామంలో జరిగే అభివృద్ధి కి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామంలో జరిగే అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ వడ్లమూడి ఏసు, గ్రామ పెద్దలు రెడ్డిబోయిన నవీన్, దూదిపాల సైదులు, దండా వెంకటేశ్వర్లు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ రెండవ మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/సుజాతనగర్‌: దేశంలో కార్మికుల హక్కుల సాధన కోసం నేడు సారపాక లో జరిగే ఏ ఐ టి యు సి రెండవ మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లలో ఏఐటీయూసీ కార్మిక సంఘాలతో కలిసి కరపత్రాలను పంచుతూ మహాసభ కు తరలిరావాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జమలయ్య మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ చట్టాల కోసం ఎనిమిది గంటల పని విధానం కోసం మొదటిసారి పోరాడిన కార్మిక సంఘం ఏఐటీయూసీ అన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులను ఉద్యోగులను పెట్టుబడిదారుల కు కట్టు బానిసలుగా మారుస్తుందన్నారు. మహాసభకు కార్మికులు, ఉద్యోగులు, కార్మిక వర్గ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగేష్, పోగుల కోటేశ్వరరావు, కౌన్సిలర్ భూక్య శీను, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దసురు, ఎంపీపీ భూక్య పద్మావతి, సంయుక్త కార్యదర్శి కుమారి హనుమంతరావు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల రాములు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, ఎంపీటీసీ గణేష్, ఏఐటీయూసీ సిపిఐ నాయకులు కుమారి కృష్ణ, భాగం శశికాంత్, దొడ్డ వెంకన్న, దండు సురేష్, రావి శెట్టి లక్ష్మ య్య, రాము తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/ తల్లాడ ః ప్రస్తుత వ్యవసాయం సీజన్ ప్రారంభం కావడంతో రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు అమ్మేవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ ఖమ్మం జిల్లా సభ్యులు మద్దోజు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రైతులు పత్తి విత్తనాలు, మిర్చి విత్తనాలు, వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు తీసుకుంటున్న నేపథ్యంలో కొంత మంది కేటుగాళ్లు బిల్లు లేకుండా విత్తనాలు రైతులకు అంటగడుతున్నారని, ఈవిషయం రైతులు వెంటనే ప్రభుత్వందృష్టికి తీసుకెళ్లాలని బిల్లు లేకుండా విత్తనాలు అమ్మేవారిపై వ్యవసాయశాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని, అలాగే వ్యవసాయధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కోరారు.

## తాగునీటి సమస్య పరిష్కారం





ప్రజాపక్షం/ మధిర ః మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి 6వ వార్డులోని యాదవ బజార్‌లో గత కొంతకాలంగా మంచినీటి బోరు చేతి పంపు మరమ్మత్తులకు గురికావడంతో ప్రజలు తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు వార్డు కౌన్సిలర్‌కు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రజల తాగునీటి సమస్యను తెలుసుకున్న సిపిఐ మండల నాయకులు అన్నవరపు సత్యనారాయణ సంబంధిత మున్సిపాల్టీ అధికారులతో మాట్లాడి మంచినీటి బోరు చేతి పంపుకు మరమ్మత్తులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణను ఆ వార్డు ప్రజలు అభినందించారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



ప్రజాపక్షం/ మధిర ః మండల పరిధిలోని మాటూరుపేట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గుదే రాఘవయ్య, కుమారుడు రామకృష్ణ సహకారంతో ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. శనివారం పాఠశాల హెచ్ఎం జె.వీరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సిహెచ్. శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సేవా దృక్పథంతో దాతలు నోట్ పుస్తకాలను అందించటం జరిగిందని, నోట్ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దాతలు రాఘవయ్య, కుమారుడు రామకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇబ్రహీం, నాగరాణి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు ఆందోళనలు

**వేలం పాట ఉపసంహరించుకోవాలి : సిపిఐ**



ప్రజాపక్షం/ ఖమ్మం : సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకుల వేలాన్ని ప్రభుత్వం తక్షణం ఉప సంహరించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బొగ్గు వేలం పాటలను అడ్డుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కోరారు. ఇప్పటికే సింగరేణి సంస్థ రోజు రోజుకు కుచించుకుపోతున్నదని ఈ నేపథ్యంలో సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకులను వేలం వేస్తే మనుగడే ప్రమాదంలో పడుతుందన్నారు. కేంద్రం ప్రైవేటు వ్యక్తులకు జాతి సంపదను కట్ట బెడుతుదని ప్రసాద్ ఆరోపించారు. గతంలో లక్షకు పైబడిన కార్మికులు కోట్లాది రూపాయల టర్నోవర్‌తో సిరుల తల్లిగా పేరొందిన సింగరేణి ఇప్పుడు బొగ్గు నిక్షేపాలు కరువై యాంత్రీకరణ పెరిగి కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆయన తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి విషయంలో అటు బిజెపికి మద్దతునిస్తూ ఇటు వేలం పాటలకు పోకుండా అడ్డుకుని భవితవ్యాన్ని దెబ్బతీసిందని ఆయన తెలిపారు. ఇప్పటికే కోయగూడెం ఉపరితల గనిని అరబిందో కంపెనీకి అప్పగించిందని సత్తుపల్లి ఓసిని మరో ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన బిజెపి ఇప్పుడు మరో మూడు బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని సిపిఐ తీవ్రంగా నిరసిస్తుందన్నారు. సింగరేణి పరిరక్షణ కోసం సిపిఐ నేతృత్వంలో కమ్యూనిస్టులు అనేక త్యాగాలు చేశారని, సింగరేణి పరిరక్షణకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని సిపిఐ పిలుపు నిస్తుందన్నారు.సిపిఐ నేతృత్వంలో వేలం పాటలను ప్రైవేటు సంస్థలు బొగ్గు తీయడాన్ని అడ్డుకుంటామని ప్రసాద్ స్పష్టం చేశారు. కార్మికులు, పార్టీ కార్యకర్తలు సింగరేణి పరిరక్షణకు ప్రతినబూనాలన్నారు.

# సోషల్ వెల్ఫేర్‌లో ఇష్టారాజ్యం..!

**- ఫుడ్‌పాయిజనై విద్యార్థులు అస్వస్థతకు గురైన పట్టించుకోని వైనం**
**- సమస్యలపై నిలదీసిన విద్యార్థి సంఘాలపై సిబ్బంది దురుసు ప్రవర్తన**





ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ ః పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇవ్వాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సాక్షిగా చెడ్డపేరు మూటగట్టుకుంటుంది. ఫుడ్ విషయంలో చేస్తున్న నిర్లక్ష్యంతో విద్యార్థినిలు తరచు ఫుడ్‌పాయిజన్‌కు గురవుతుండటం ఆందోళన కలిగిస్తుంది. గతంలో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థినిలు ఆందోళన చేసినప్పటికీ పర్యవేక్షకులలో ఎటువంటి మార్పురాకపోవడం అక్కడి పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. తాజాగా శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని కోదాడక్రాస్‌రోడ్‌లో గల సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థినిలు ఫుడ్‌పాయిజన్ అయ్యి అస్వస్థతకు గురైన పట్టించుకోకపోవడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. దీంతో అక్కడి పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన విద్యార్థి సంఘాల నేతలపై సిబ్బంది దురుసు ప్రవర్తనను కనబరిచారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ మాట్లాడారు...డిగ్రీ కళాశాలలో ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులను తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపిచి ఉపాధ్యాయులు చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 20రోజులు గడుస్తున్నప్పటికీ కనీసం ఒక క్లాసు కూడా బోధించకపోవడం బాధాకరమన్నారు. ఇక్కడి సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా అధికారులు వైఫల్యం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిలకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా విద్యార్థులకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఆర్‌సిఓగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోపం వల్లనే ఇలా జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యార్థినులను మానసికంగా కృంగదీస్తూ విద్యార్థి సంఘాల ముందు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి గురుకులంలో జరుగుతున్న పరిస్థితులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాలన్నింటిని కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, రాకేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వినోద్, మనోజ్, పిడిఎస్ జిల్లా నాయకులు భాను, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు లక్షల రుణమాఫీ పట్ల కిసాన్ కాంగ్రెస్ హర్షం




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల కిసాన్ కాంగ్రెస్ హర్షం వ్యక్తం చేసింది. శనివారం రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామంలో కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ డిక్లరేషన్‌లో భాగంగా రెండు లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేసేందుకు సిద్ధమైందన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉన్న రైతుల రుణమాఫీకి రూ. 31వేల కోట్లు అవసరం అవుతాయని గుర్తించి ఆగస్టు 15 లోపు చేసేందుకు రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారన్నారు. రైతులకు రుణమాఫీ అయితే కొత్త రుణాలు మంజూరవుతాయని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం రైతుబంధు పేరిట అర్హత లేని వారికి కూడా అందించిందని ఆయన తెలిపారు. రైతు భరోసాకు సంబంధించి మంత్రుల కమిటీని నియమించిందని వారి నివేదిక ప్రకారం రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం అరిఫ్ పొలంలో కొబ్బరికాయ కొట్టి దుక్కిదున్ని ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, కోటేరు నర్సిరెడ్డి, చీమల గోపి, సన్నిళ్ల వెంకటేష్, తావుర్యా నాయక్, మాజీ సర్పంచ్ బాతుల రమణ సుధాకర్, బండి రమాదేవి, ఎస్‌కె అరిఫ్, కొంగర నరేష్, సామేలు, వెంకన్న, పుల్లయ్య, రాజశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### మట్టిమాటున...
# ఏదులాపురం చెరువు కబ్జా..!

**- 100ఎకరాలకుగాను 40 ఎకరాలు హాంఫట్**
**- యథేచ్ఛగా మట్టిని పోసుకుని దర్జాగా ఆక్రమణ**
**- చెరువులోకి నీరు వచ్చే కాల్వను మింగేసిన ఘనులు**
**- వరదపోటెత్తితే మునగనున్న ఎస్‌సి కాలనీ**
**- సర్వేచేయాలని కోరుతున్న ప్రజలు**





ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ ః ఉన్న నాలుకకు మందేస్తే...కొండనాలుక ఊడిందన్న చందంగా తయారయ్యింది...ఏదులాపురం చెరువు పరిస్థితి. రైతులకు మట్టి తోలుకోవడం కోసం ఇచ్చిన అనుమతులు ఓ పక్క మట్టి మాఫియాకు,మరో పక్క చెరువు ఆక్రమణదారులకు కలిసివచ్చింది. మట్టిమాఫియ తూతూమంత్రంగా రైతులకు మట్టి తోలి..వేల ట్రిప్పులను వెంచర్లు,ఇండ్ల సముదాయాలకు తరలించి లక్షలు దండుకున్నారు. అలాగే చెరువును ఆక్రమించుకున్న వారికి సైతం మట్టిని తోలడంతో కబ్జాదారులు రిటైనింగ్‌వాల్‌లా సుమారు 6నుంచి8 అడుగుల ఎత్తున ఆయకట్టు వారాగా మట్టి కట్టలను కట్టుకున్నారు. దీంతో చెరువులో వరదపోటెత్తితే అక్కడి ఎస్‌సీ కాలనీలోకి నీరు చేరి ముంపుకు గురయ్యే ప్రమాదకరపరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. గత మూడు నెలలుగా సాగుతున్న అడ్డగోలు వ్యవహారంపై అధికారులు చోద్యం చూస్తుండటంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువు విధ్వంసంపై ఫిర్యాదులు చేసిన వారి పేర్లను మట్టిమాఫియాకు ఇరిగేషన్ అధికారులు చెవిన వేసిన తీరు విస్తుగొల్పుతుంది. అధికారులు,మట్టి మాఫియా సాక్షిగా సాగిన దాష్టీకంపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోని,కబ్జా కొరల నుంచి చెరువును కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

**100ఎకరాలకు గాను 40ఎకరాలు హాంఫట్...**

చెరువు విస్తీర్ణం మొత్తం 100ఎకరాల్లో ఉండగా సుమారు 40ఎకరాలకు పైగా ఆక్రమణకు గురయ్యింది. మట్టిమాఫియాతో చెరువులోని మట్టి తోలించుకున్న ఆక్రమణదారులు దర్జాగా చెరువునే కబ్జా చేశారు. రిటైనింగ్‌వాల్ కట్టినట్టుగా ఆక్రమణ భూముల్లోకి నీరు రాకుండా 6నుంచి8 అడుగుల ఎత్తులో ఆయకట్టు వారాగా మట్టి కట్టలను నిర్మాణం చేసుకున్నారు. అది కూడా అక్రమంగా తోలిన మట్టిని దర్జాగా తోలుకుని, చేపట్టిన తీరు అధికారయంత్రాంగా పనితీరును వేలెత్తి చూపిస్తున్నాయి. గతంలో చెరువు ఆక్రమణపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు సర్వే చేసి హద్దులను నియమించారు. కానీ ప్రస్తుతం కబ్జా రాయుళ్ళు వాటిని చెరిపేసి కొంత ముందుకు చెరువులోపలికి వచ్చి మరి భూమిని ఆక్రమించుకున్నారు.అలాగే చెరువులోకి సాగర్ కాల్వ ద్వారా నీరు వచ్చే కాలువను సైతం కబ్జా చేసి మట్టితో నింపేసుకున్నారు. వారితో పాటు ఓ రియల్ వ్యాపారి వ్యక్తి సైతం తన వెంచర్‌ను కాలువను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్నాడు. వారు చేసిన దురాక్రమనతో సాగర్‌లో నుంచి చెరువులోకి నీటిని విడుదల చేసిన నీరు ప్రవహించ లేని విపత్కర పరిస్థితులు ఏర్పడనున్నాయి.

**వరదపోటెత్తితే మునగనున్న ఎస్‌సీ కాలనీ...**

చెరువు ఆక్రమణదారులు చేసిన దుశ్చర్యతో ఏదులాపురం గ్రామంలోని ఎస్‌సీ కాలనీ ప్రమాదంలో పడిపోయింది. వరదపోటెత్తిన్నప్పుడు బఫర్ జోన్ వరకు నీరు చేరి ఆగాల్సి ఉండగా..ఆ ప్రాంతం కబ్జా కావడంతో పాటు చెరువు కూడా కబ్జాకు గురయ్యింది. ఆ భూముల్లోకి నీరు రాకుండా రిటైనింగ్‌వాల్‌లా సుమారు 6నుంచి8 అడుగుల ఎత్తులో కబ్జా రాయుళ్ళు మట్టి కట్టలను కట్టారు. నీరెల్లే దారిలో ఏర్పాటు చేసిన మట్టి కుప్పలతో పల్లమెరిగిన నీరు వెల్లువై ఎస్‌సీ కాలనీని ముంచెత్తబోతుంది. ఈ అడ్డంకితో చెరువుకు కింద వైపుగా నీరు ప్రవహించి పోటెత్తిన నీరు ఎస్‌సీ కాలనీని ముంపునకు గురిచేయనుంది. గతంలో చెరువు పోటెత్తిన క్రమంలో ఎస్‌సీ కాలనీ మునకకు గురికావడంతో ప్రజలు చెరువు ఆక్రమణపై ఫిర్యాదు చేయడంతో అధికారులు సర్వే చేసి ఆక్రమణను తొలగించి హద్దులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చెరువు ఎండిపోవడంతో రైతుల పేరుతో మట్టి తరలింపు అవకాశం కలిసిరావడంతో మట్టి మాటున ఆక్రమణ సులువు అయ్యింది. ఈ నేపథ్యంలో బఫర్‌జోన్‌తో పాటు చెరువునే మింగేయడంతో ఎస్‌సీ కాలనీకి పొంచి ఉన్న ప్రమాదకరపరిస్థితులపై వారు ఆందోళన చెందుతున్నారు. ఆక్రమిత దారులు వ్యహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునకకు గురైన ప్రతిసారి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

**నా ఇల్లు మునకకు గురవుతుంది**
**బంక మధు, ఏదులాపురం గ్రామస్థుడు (ఎస్‌సీ కాలనీ)**



చెరువుకు వరద పోటెత్తినప్పుడు నా ఇంటితో పాటు మా ఎస్‌సీ కాలనీ మునకకు గురవుతుంది. దీంతో గోడలు నాని కూలిపోయి తమకు నష్టం ఏర్పడుతుంది. వరద నీరు ఇంట్లోకి చేరి ఇల్లు మొత్తం బురదమయం కావడంతో పాటు విషసర్పాలు ఇంట్లోకి వస్తున్నాయి. చెరువు అయకట్ట వారాగా నిర్మించిన మట్టి కుప్పలతో నీరు ఉధృతంగా కాలనీవైపు ముంచెత్తుతుంది. కలెక్టర్‌గారు స్పందించి తమ గోసను పరిష్కరించాలి.

**చెరువులపై అజమాయిషీ ఇరిగేషన్‌ది : బి. రాంప్రసాద్, తహశీల్దార్,**



చెరువులపై అజమాయిషీ ఇరిగేషన్‌వారికి ఉంటుంది. అందులో మట్టితోలకాలు జరిగిన, చెరువు ఆక్రమణకు గురైన పరిశీలించాల్సిన బాధ్యత వారిదే. కబ్జాను గుర్తించి రెవిన్యూకు ఇరిగేషన్ నుంచి రాస్తే వారితో కలిసి జాయింట్ సర్వేను చేయడానికి తాము వస్తాము. చెరువు ఆక్రమణతో ప్రజలకు ప్రమాదం జరిగే పరిస్థితులు ఉన్నాయి కావున ఇరిగేషన్‌వారు స్పందిస్తే తాము సహకరిస్తాము.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం : మందీప్, ఇరిగేషన్, ఏఈ**

చెరువును పరిశీలిస్తాము కబ్జా గురైతే వాటిని తొలగించి ఆక్రమిత దారులపై చర్యలు తీసుకుంటాం. అలాగే చెరువులోకి వచ్చే కాలువ కబ్జాను పరిశీలించి తొలగింపు చేపిస్తాను. ఇప్పటికే అక్రమ మట్టితోలకాలు జరిపిన వారిపై పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేపించి కేసులు నమోదు చేపించాను. చెరువు మట్టిని రైతుల పొలాలకు మాత్రమే తోలుకోవాలి.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. కమాన్‌బజార్‌లో 30 ఏళ్లుగా టీ అమ్ముతున్న కొండా కూమార్తె వికలాంగురాలైన రాశి పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ. 10వేలను శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వికలాంగురాలైన అమ్మాయి పెళ్లికి ఆర్థిక సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి వేముల హన్మంతరావు, జోన్ ఛైర్మన్ డా॥ డిసిసి రావు, నాగేశ్వరరావు, కమర్తపు కిరణ్, దుర్గా నాగేశ్వరరావు, గోవర్ధన్, అబ్దుల్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీలో సీటు సాధించిన శ్రీరామ్ రెడ్డి





ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని లక్ష్మీ పురం గ్రామానికి చెందిన సంగు వెంటక సుబ్బారెడ్డి, రోజా దంపతుల కుమారుడు సంగు శ్రీరామ్‌రెడ్డి ఐఐటీ తిరుపతిలో ఎంఎస్‌లో సీటు సాధించారు. ఐఐటీలో తమ కుమారుడు శ్రీరామ్‌రెడ్డి సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. శ్రీరామ్‌రెడ్డి 1వ తరగతి నుండి 6వ తరగతి వరకు లక్ష్మీ పురం గ్రామంలోని శ్రీ శ్రీనివాస విద్యానికేతన్‌లో, 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఖమ్మంలోని శ్రీ చైతన్య ఒలింపియాడ్‌లో, ఇంటర్ కొత్తగూడెంలోని నలంద జూనియర్ కాలేజ్, బీటెక్ రాజస్థాన్(ఉదయ్‌పూర్)లోని శ్రీ పతంపద్ సింగనియా యూనివర్సిటీలో పూర్తి చేసి గేట్ 2024లో ఉత్తీర్ణత సాధించి తిరుపతి ఐఐటీ యూనివర్సిటీలో ఎంఎస్(యాంత్రిక పరిశోధన) కొరకు సీటు సాధించాడు. ఐఐటీలో లక్ష్మీ పురంకి చెందిన శ్రీరామ్‌రెడ్డి సీటు సాధించడం పట్ల పలువురు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

## పలువురు ఉపాధ్యాయులకు పదోన్నతులు



ప్రజాపక్షం/చంద్రుగొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చంద్రుగొండ మండలంలోని పలు పాఠశాలలో పిఈటీలు, ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారికి పదోన్నతలు లభించారు. కాగ వారి పదోన్నతలు ఉత్తర్వులను ఎంఈవో సత్తెనపల్లి సత్యనారాయణ శనివారం అందించారు. పదోన్నతలు లభించిన వారు బదిలీపై వెళ్లగా ఇతర మండలాల నుండి ఆ స్థానాలలో ఉపాధ్యాయులు బాధ్యతలను చేపట్టారు. సుమారు మండలం నుండి 20 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా, అదే స్థానంలో 20 మంది విధుల్లో చేరినట్లు ఎంఈవో సత్యనారాయణ ప్రజాపక్షంకు తెలిపారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులను పూర్తి విస్మరించిందని, నేడు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతలు కల్పించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జయకర్, కృష్ణ, బాబులాల్, రమేష్, జయరామ్, రవి, సరోజా, దివేనమ్మ, భాస్కర్ ఉన్నారు.

## 25న చలో కలెక్టరేట్




ప్రజాపక్షం/ములకలపల్లి: ఈనెల 25న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని ములకలపల్లి ఎంపివో, యుడిసికి సిఐటియు ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నిమ్మల మధు, రజక సంఘం నాయకులు ముదిగొండ రాంబాబులు మాట్లాడుతూ పంచాయితీ కార్మికులు గతంలో అనేక సమ్మెలు ధర్నాలు చేస్తే ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేడు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని ఆరోపించారు. మల్టీ పర్పస్ వర్క్ విధాన్ని రద్దు చేయాలని, పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్, భీమా రూ 10లక్షలు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో ములకలపల్లి మండల గ్రామ పంచాయితీ కార్మికుల నాయకులు చిక్కుల శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, వర్క రుక్మధరావు, మేకల రమేష్, కారంపూడి సాయిరత్న, కుక్కర్‌గడ్డ సతీష్, గడ్డం రాజు, శంకర్, వెంకన్న, కొత్తపల్లి కృష్ణ, మాలోత్ రాజు, ఒగ్గల ధారయ, రాఘవులు, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

## బొగ్గు బావుల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: బొగ్గు బావుల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సింగరేణి కార్మికులకు మద్దతుగా శనివారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం ఆపాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, సింగరేణి బొగ్గు బావులను ప్రైవేట్ పరం చేయడం కేంద్ర ప్రభుత్వం తక్షణమే మానుకోవాలన్నారు. బొగ్గు బావల ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోకపోతే ఐక్య కార్మిక సంఘాలతో కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలు ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ముదిగొండ సావిత్రి, ముదిగొండ లక్ష్మి, మందపురి రాజమ్మ, కందుకూరి విజయకుమారి, అరుణ, బొమ్మగాని సైదమ్మ, వాసం వెంకటరమణ, గణప లక్ష్మి, గణప ఆదిలక్ష్మి, బిబినేని కృష్ణవేణి, కందుకూరి నాగమణి, దునుకుల రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే ఇంటి నెంబర్‌పై మూడు రిజిస్ట్రేషన్‌లు



-తప్పుడు రిజిస్ట్రేషన్‌లపై
రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన
-డాక్యుమెంట్ రైటర్ల తీరుపై ఆగ్రహం
-జిల్లా కలెక్టర్ సార్..
దిద్దుపూడి రిజిస్ట్రేషన్‌లపై విచారణ చేపట్టండి

**ప్రజాపక్షం/వైరా:** వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు తప్పుడు రిజిస్ట్రేషన్లపై ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దిపూడి గ్రామానికి చెందిన కొంతమంది ప్రజలు శనివారం వైరాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు తప్పుడు రిజిస్ట్రేషన్‌లతో ప్రభుత్వ భూములు మింగుతున్నారని , ఇలాంటి తప్పుడు రిజిస్ట్రేషన్ నుండి ప్రభుత్వ భూములు కాపాడాలంటూ ఆందోళన నిర్వహించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కరుణని కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ కరుణ వాళ్ళు ఇచ్చిన ఇంటి నెంబర్లు ఆధారంగా రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. అదేవిధంగా ఇంటి నెంబర్లు రిజిస్ట్రేషన్ చేశామని అన్నప్పుడు అక్కడ ఇళ్ళు ఉందా లేదా అనేది కూడా చూడాల్సిన బాధ్యత ఎవరిదని గ్రామస్థులు ప్రశ్నించారు. సబ్ రిజిస్ట్రార్ కరుణ డాక్యుమెంట్ రైటర్ల ప్రాంతంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మున్సిపాలిటీ నుంచి వచ్చిన ఇంటినెంబర్లపై ద్వారా రిజిస్ట్రేషన్ జరిగిందని వాస్తవాలను పరిశీలిస్తామని చెప్పారు. డాక్యుమెంట్ రైటర్ కొల్లి వెంకటేశ్వర్లు తీరుపై ఇప్పుడు దుమారం లేపుతుంది. అసలు ప్రభుత్వ భూములను ఎలాగ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. తప్పుడు డాక్యుమెంట్లు పెట్టి ఎందుకు కొల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వ భూములను కనుమరుగు చేస్తున్నాడు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కొల్లి వెంకటేశ్వరరావు డాక్యుమెంట్ రైటర్ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములను పార్టిషన్ పేరుతో మరికొన్ని స్థలాలను తప్పుడు మార్గంలో రిజిస్ట్రేషన్లకు సూత్రధారిగా కొల్లి వెంకటేశ్వరరావుతో పాటు మరో డాక్యుమెంట్ రైటర్ కూడా ఉన్నాడని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో ఓ బిల్ కలెక్టర్ కూడా ఈ తప్పుడు రిజిస్ట్రేషన్‌లో భాగస్వామ్యమని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎందుకంటే మున్సిపాలిటీ నుండి ఇంటి నెంబర్లు ఇప్పించడంలో అతను కీలకంగా వ్యవహరించారని ఆరోపణలు లేకపోలేదు.




**ఒకే ఇంటి నెంబర్‌పై మూడు రిజిస్ట్రేషన్లు...**

వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దిపూడి గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు హద్దు లేకుండా పోతుంది.భూమిపై కన్ను పడితే చాలు ఆ భూమిని ఎలాంటి పత్రాలు లేకపోయినా తప్పుడు మార్గంలో తప్పుడు ధృవీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేపిస్తున్నారు అని ఆరోపణలు లేకపోలేదు. ఒకే ఇంటి నెంబర్‌పై మూడు నుంచి నాలుగు రిజిస్ట్రేషన్లు కూడా చేశారు. అసలు ఒక్క ఇంటి నెంబర్‌పై రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు ఆ ఇంటి నెంబర్‌పై ఆ ఇళ్ళు అక్కడ ఉందా లేదా అని చూడాల్సిన బాధ్యత కూడా పట్టించుకోని పరిస్థితి. అసలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇత తతంగం ఎలా నడుస్తుంది. ఆ డాక్యుమెంట్ రైటర్‌లో చెప్పిన విధానాన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయం సిబ్బంది ఎందుకు నమ్ముతున్నారు. ఇలాంటి ప్రభుత్వం భూములు తప్పుడు మార్గంలో ఎందుకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ సారో వైరస్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరుగుతున్న తప్పుడు రిజిస్ట్రేషన్‌పై నూతనంగా వచ్చిన జిల్లా కలెక్టర్ సాధించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## రైతు భరోసా విడుదల చేయండి



**ప్రజాపక్షం/వైరా:** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం వైరా మండలం లింగన్నపాలెం గ్రామంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ ముదస్తుగా నైరుతి రుతుపవనాలు ప్రభావంతో మే నెల చివరిలో అనుకూలంగా వర్షం రావడంతో జూన్ నెలలో మొదటి, రెండో వారంలో రైతులు పత్తి విత్తనాల వేయడం జరిగిందని, తిరిగి వాతావరణం మార్పు వచ్చి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండి వేసిన విత్తనాలు మొలక రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, గత రబీ సీజన్‌లో డిసెంబర్ నుంచి వర్షాలు కురవక, ప్రాజెక్టుల్లో నీరు లేక వాగులు, వంకలు, చెరువులు, కుంటలు క్రింద సాగు చేయలేదని, అరకొరగా సాగు చేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా రైతులు నష్టపోయారని, మామిడి లాంటి పండ్లు తోటలు రైతులు కూడా దిగుబడులు గణనీయంగా తగ్గి ఆదాయం లేక అప్పులు చేసే పరిస్తితి నెలకొందని, రైతులు అవసరాల కోసం రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నియమ నిబంధనలు రూపకల్పన కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి జులై 15 వరకు గడువు ఇవ్వడం, మరల అసెంబ్లీలో చర్చ కూడా జరపాలనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన మరింత సమయం పట్టే అవకాశం ఉన్న నేపద్యంలో రైతుబంధు నిబంధనలు ప్రకారం రబీ సీజన్‌లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిన ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్ రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు మేడా శరబంది, కౌలు రైతు సంఘం నాయకులు యనమద్ది రామకృష్ణ, షేక్ జానిమియా, బాణాల కృష్ణమాచారి, హరి వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## విత్తన కొనుగోలు రశీదులను భద్రపర్చుకోవాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదులను పంట కాలం చివరి వరకు భద్రపర్చుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి ముండ్లపాటి విజయ నిర్మల సూచించారు. శనివారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో పత్తి, జనుము, జీలుగు వంటి పచ్చిరొట్టె పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. పత్తిసాగుకి నేలలో తగిన పదును ఉన్నప్పుడు మాత్రమే విత్తుకోవాలని తెలిపారు. అదేవిధంగా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రశీదు పొందాలని, రశీదును భద్రపర్చుకోవడం ద్వారా జన్యు స్వచ్ఛత లోపాల వల్ల, మొలక శాతం తక్కువైనప్పుడు తగిన పరిహారం కోరే హక్కు రైతుకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సర్వసుద్ధి సరిత, వ్యవసాయ విస్తరణ అధికారి బద్దల కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

## బాగం బాగేశ్వరరావుకు నివాళి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని గోవిందాపురం గ్రామంలో భాగం రమేష్ తండ్రి భాగం బాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా శనివారం దశదిన కర్మ జరిగింది. ఈ కార్యక్రమానికి బోనకల్ తహశీల్దార్ పూర్ణచంద్ర, ఆర్ఐ లక్ష్మణ్, శ్రీ రక్షా హాస్పటల్ అధినేత జివి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మాజీ సర్పంచ్ పారా లక్ష్మీ నారాయణ, మర్రి తిరుపతిరావు, భాగం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలి

-పాఠశాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని అందుకు అనుగుణంగా విద్యను అభ్యసించాలని ఖమ్మం అడిషనల్ కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తెలిపారు. శనివారం రఘునాథపాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం ఉన్నత పాఠశాలను అడిషనల్ కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ సందర్శించారు. విద్యార్థులతో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజన బియ్యాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థుల వివరాలను హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని హాజరు శాతం తగ్గకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కలిగేలా విద్యా బోధనను అందించాలన్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టాల వితరణ




**ప్రజాపక్షం/వైరా:** గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు వుంద్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో లయన్ సూర్యదేవర శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన రైతులు నల్లమోతు రవి, బి.శిరీషకి రెండు పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్పర్సన్ లగడపాటి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ పుట్టినరోజు సందర్భంగా సర్వీస్ చేయాలని, ఈ రోజు సర్వీస్ చేసిన లయన్ శ్రీధర్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిఎంటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, గంగవరపు కిషన్‌రాయ్, వుయ్యూరు రామకృష్ణ, మిట్టపల్లి నాగి, కిరణ్ పాల్గొన్నారు.

## శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి బిజెపి ప్రభుత్వం వ్యతిరేకం



**ప్రజాపక్షం/ బోనకల్ :** శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి బిజెపి ప్రభుత్వం వ్యతిరేకమని సిపిఎం జిల్లా అకడమిక్ సెల్ కమిటీ సభ్యులు బోడపట్ల రవీందర్ అన్నారు. మండల పరిధిలోని జానకిపురం గ్రామంలోని తేజా పంక్షన్ హాల్ నందు రెండవరోజు సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. మతం, మతోన్మాదం అనే అంశాన్ని బోడపట్ల రవీందర్ బోధించారు. మతానికి, మతోన్మాదానికి ఎంతో వ్యత్యాసం ఉందని, మతోన్మాదం అనేది ఇతరులపై బలవంతంగా రుద్దేదన్నారు. మతోన్మాదం దేశ ప్రయోజనాలకు హానికరమన్నారు. అదేవిధంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ అధ్యయనం లేకపోతే అన్ని వర్గాల ధోరణులు పెరిగిపోతాయని అన్నారు. పార్టీ నిర్మాణం అనే అంశాన్ని సుదర్శన్‌రావు బోధించారు. పార్టీ నిర్మాణం అమలు చేస్తే లాభం, ప్రయోజనం జరుగుతుందని, పార్టీ నిర్దేశించిన ప్రధానమైన నాలుగు అంశాలను ప్రతి సిపిఎం పార్టీ సభ్యుడు తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే సిపిఎం పార్టీ బలోపేతానికి ప్రతికార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొండపాడు నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలచెర్వు కోటేశ్వరరావు, వ్య.కా.సం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, వివిధ గ్రామాల పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తోటకూర సత్యనారాయణకు నివాళి

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం లింగన్నపాలెం గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన తోటకూర సత్యనారాయణ దశదిన కార్యక్రమానికి హాజరై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పుచ్చకాయల వీరభద్రం, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పమ్మి అశోక్, బోళ్ళ గంగారావు, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు చింతనిప్పు మాధవరావు, తోటకూర జగ్గయ్య, దూళిపాళ్ళ కిషోర్, చంగాల పరశురామ్, వన్నవరపు కొండలు, తేళ్లూరి వీరయ్య తదితరులు ఉన్నారు.

# అక్రమ అరెస్టులు అన్యాయం

## కర్నాటి కృష్ణను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అక్రమంగా అరెస్టులు చేయడం అన్యాయమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఇటీవల 41వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణను అక్రమంగా అరెస్టు చేశారు. ఈ క్రమంలో శనివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కర్నాటి కృష్ణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అక్రమ అరెస్టుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని బిఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. అక్రమ కేసులపై ధైర్యంగా పోరాడదామని మాజీ మంత్రి పువ్వాడ తెలిపారు. ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కార్పొరేటర్ వలరాజు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బిక్కసాని జశ్వంత్, చిన్ని, గిరి, షకీనా, అప్పారావు, ఉస్మాన్, సాయి తదితరులు ఉన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం


**ప్రజాపక్షం/కరకగూడెం:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారనీ, రుణమాఫీ రైతులకు ఎంతో మేలు అని కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. 12.12.2018 నుంచి 9.12.2023 మధ్య ఐదేళ్ల కాలంలో రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది అని అన్నారు. ఆగస్టు 15 2024 లోపు 48 లక్షల మంది రైతుల యొక్క రుణాలను దాదాపు 31 వేల కోట్ల తో రుణమాఫీ చేయడానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అదేవిధంగా సన్నాలకు 500 రూపాయలు బోనస్ ప్రకటించడంతో తెలంగాణ రాష్ట్ర రైతులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగం పక్షాన, తన తరపున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గానికి ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# రైతు రుణమాఫీకి మంత్రివర్గం ఆమోదం పట్ల హర్షం

**ప్రజాపక్షం/దమ్మపేట:** రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాల మాఫీకి తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ యువ నాయకులు కాక రమేష్ తెలిపారు. డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023 లోపు తీసుకున్న వ్యవసాయ రుణాలకు వర్తింపు ఉంటుందని తెలిపారు. సుమారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 48 లక్షల మంది రైతులకు రూ. 31 వేల కోట్ల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల కాక రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు 15, 2024లోపు రుణమాఫీ పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేయడం శుభ పరిణామం అన్నారు. మే 6, 2022 నాటి వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రైతులకు రుణమాఫీ హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు సీఎం రేవంత్ సర్కారు 2 లక్షల రూపాయలు ఏకకాల రైతు రుణమాఫీ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతల హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయని అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యువ నాయకులు కాక రమేష్ తెలిపారు. రైతు రుణమాఫీ కార్యక్రమం దేశ చరిత్రలో నిలుస్తుందని ఇంతటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకి, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు కి, జిల్లా మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గానికి, రాష్ట్ర శాసన సభ్యులకు, అశ్వారావుపేట స్థానిక శాసన సభ్యులు జారే ఆదినారాయణకి తెలంగాణ రాష్ట్ర రైతుల అందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# గోదావరిలో పడి బాలుడి మృతి

## -నలుగురిని కాపాడిన స్థానికులు



**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరినదిలో స్నానం కోసం దిగిన ఓ బాలుడు కొట్టుకుపోయి మృతి చెందగా, మరో నలుగురుని స్థానికులు కాపాడిన ఘటన శనివారం భద్రాచలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం, బూర్గంపాడు గ్రామానికి ఓ వివాహం నిమిత్తం ఏలూరు నుండి వచ్చిన వారిలో ఐదుగురు బాలురు గోదావరిలో స్నానం చేసేందుకు భద్రాచలం వచ్చారు. స్నానం చేస్తుండగా లోతుతెలియక కొట్టుకుపోతుండటంతో గమనించిన స్థానికలు, ఈతగాళ్లు, ఫొటోగ్రాఫర్లు కాపేడే ప్రయత్నం చేశారు. వీరిలో నలుగురుని కాపాడగా మరో బాలుడు కార్తీక్ (11) నీటిలో మునిగ ఊపిర ఆడక మృతి చెందాడు. బాలుడ్ని నీటిలో బయటకు తీసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

# దశదిన కర్మలకు 50 కేజీల బియ్యం వితరణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి గ్రామపంచాయతీ పెద్దమ్మగడ్డి చెం దిన దిండి నారాయణ అనారోగ్యంతో మరణించాడు. దిండి నారాయణ వారి కుటుంబానికి షేక్ గౌసుద్దీన్ శనివారం వారి దశ దిన కర్మలకు 50 కేజీల బియ్యాన్ని, రూ.3వేలు ఇచ్చామని మైనార్టీ జిల్లా నాయకుడు మాజీ వార్డు మెంబర్ షేక్ గౌసుద్దీన్ వారి కుటుంబానికి అందజేయడం జరిగింది. అలాగే ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు పెర్ని వెంకటేశ్వర్లు, తురక రవి, దిండి సీతారాములు, దిండి కోటయ్య, దిండి నాగేశ్వరరావు, తెలంగాణ ఉద్యమ నాయకుడు సోమంద నాగరాజు, హమాలి సంఘం నాయకులు తురక రాంబాబు, జూపల్లి వెంకన్న, గోపి రామారావు, విజయ్, కొడుదల కృష్ణ, సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా రోడ్డును విస్తరించండి

**ప్రజాపక్షం/మణుగూరు:** కార్మిక శ్రేయస్సు పరిరక్షణ నే ధ్యేయంగా పని చేస్తున్న స్థానిక యాజమాన్యం ప్రధాన చెక్ పోస్ట్ దాటిన తర్వాత ద్విచక్ర వాహనాల రాకపోకల కోసం వేసిన ప్రత్యేక రహదారిపై దృష్టి సారించాలని ఏరియా టి బి జి కె యస్ నాయకులు నాగెల్లి తెలిపారు. రహదారి పై గుంటలు, వర్షం కురిసిన సమయంలో బురద మట్టి, నీటి నిల్వల తో అధ్వాన్నంగా తయారైందని విధులకు హాజరయ్యే కార్మికులు ఆ రహదారి వెంబడి రాక పోకలు సాగించాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆయన తెలిపారు. విధులకు హాజరయ్యే కార్మికులు ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండ వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వేసిన ద్విచక్ర రహదారి వెంబడి పై భాగంలో ఇటీవల బి టి. పి యస్ రైల్వే ట్రాక్ పనులు నిర్వహించడం అందులో భాగంగా వారు సైడ్ డ్రైన్ లు చేపట్టినప్పటికీ సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల సైడ్ కాలువలో ఎక్కువగా మట్టితో పూడి ఉన్నాయనీ దాని వల్ల ఆ కాలువ ల ద్వారా బయటికీ వెళ్ళవలసిన నీరు రోడ్డు పైకి రావడం దానితో బురద చేరడం వల్ల విధులకు వెళ్ళే కార్మికులు ముఖ్యంగా రాత్రి పూట విధులకు హాజరయ్యే కార్మికులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సైడ్ కాలువలు నిర్మాణం చేపట్టడం వల్ల రోడ్డు పరిమాణం కూడా బాగ తగ్గి ఇరుకుగా మారిందని కార్మికులు విధులకు రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షం పడితే అండర్ బ్రిడ్జి కింద నుంచి భారీ నీటి ప్రవాహం వస్తే ఓ. సి 2, కె పి యూ జి కార్మికులను కె. సి హెచ్. పి మీదుగా దారి మళ్లిస్తున్నారని అటుగా నిరంతరం లారీలు తిరగడం వల్ల కె.సి హెచ్.పి దాటిన తర్వాత మధ్యలో రోడ్డు పై మోకాలు లోతు గుంటలు ఏర్పడ్డాయని దానిలో వర్షపు నీరు చేరడంతో గుంటలు కనపడక కార్మికులు కింద పడి గాయలు ఐనా ఘటనలు చాలా ఉన్నాయని తెలిపారు.. కార్మిక శ్రేయస్సు, సంస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం త్వరితగతిన రోడ్డు మరమ్మత్తుల పనులు చేపట్టి కార్మికులు విధుల రాకపోకలు ఆటంకాలు లేకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు.

# పురుగు మందు తాగి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కరకగూడెం:** పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరకగూడెం మండలం మొగలితోగు గ్రామానికి చెందిన అరెం శోభన్ బాబు(36) కుటుంబ కలహాల కారణంగా మద్యం మత్తులో శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలదు. మృతుడి మొదటి భార్య అరెం పద్మ పోలీస్ ఠాణాలో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

# సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు యూనిఫాం అందజేత



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియా సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఎట్టకేలకు శనివారం మురళి మ్యాన్ పవర్ సప్లై ఏజెన్సీ ఆధ్వర్యంలో యూనిఫామ్ అందజేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కాంట్రాక్టర్ ద్వారా యూనిఫామ్ అందజేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న సామాజిక కార్యకర్త కర్నే బాబురావు సెక్యూరిటీ కార్యాలయానికి చేరుకున్నారు. కాంట్రాక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చేసారి అయినా గార్డులందరికి ఖాకీ యూనిఫామ్ ఇవ్వాలని కాంట్రాక్టర్ ని కోరారు. ఇతర సామాగ్రి టార్చిలైట్, విజిల్ , వాటర్ బాటిల్, షూ, రెయిన్ కోట్, స్టిక్ మొదలగు సామాగ్రి కూడా ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జంగిల్ ప్రాంతంలో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న షెల్టర్ వద్ద లైటింగ్ మరియు ఫ్యాన్ ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని సింగరేణి సెక్యూరిటీ విభాగం అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్లు రామ్ అవతార్, కుడిపుడి సుధాకర్,పుట్ట రవి, టి.వీరబాబు, రాజశేఖర్, కే. రామకృష్ణ మరియు ఇతర ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

# రూ.10 కాయిన్స్ మార్కెట్‌లో చలామణి అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పిస్తాం



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలంలో సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ మార్పు మన నుండే మొదలవ్వాలి. మార్కెట్‌లో రూ.10లు నోట్లు దొరకడం లేదన్న సంగతి మనందరికి తెలిసిందే. రూ.10ల కాయిన్స్ మార్కెలో చెల్లుతాయని సంగతి కూడా మనకు తెలిసిందే. అందుకే మనకు ఎవరైనా రూ.10ల కాయిన్స్ ఇస్తే మనం తీసుకుందాం. పది రూపాయల కాయిన్స్ మార్కెట్‌లో చలామణి అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ మనవంతు సామాజిక బాధ్యతగా కృషి చేద్దాం.

# ఉపాధ్యాయులు మాదినేని నర్సింహారావుకు సన్మానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పెద్దగోపతి పాఠశాలకు వెళ్ళిన మాదినేని నర్సింహారావును అన్నారుగూడెం మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్ సన్మానించారు. శనివారం పాఠశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం కృష్ణయ్య, దుగ్గినేని వెంకటయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్. యాకుబ్‌పాషా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.